# నర్సింగరావు వల్లే ప్రమాదం తప్పింది



నర్సింగరావును అభినందిస్తున్న నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య

అబిడ్స్, నవంబర్ 18: షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోషామహల్ చాక్నవాడిలో శనివారం తెల్లవారుజామున ఉడ్ బీడింగ్ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు, పోలీసులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన షాహినాయత్‌గంజ్ రాతా పరిధిలో శనివారం జరిగింది. సీఐ నాగం రవీందర్ తెలిపిన ప్రకారం, తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఉడ్ బీడింగ్ దుకాణంలో మంటలు చెలరేగడంతో స్థానిక షాపు యజమాని ఫిరోజ్ వెంటనే అక్కడికి చేరుకొని పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పివేశారు. లేని పక్షంలో పక్కనే ఉన్న కలప డిపోలకు మంటలు వ్యాపించి భారీ నష్టం జరిగి ఉండేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటన సమయంలో విజయ డైరీ ఫారానికి చెందిన నర్సింగరావు అనే వ్యక్తి అప్రమత్తం కావడం వల్ల భారీ ప్రమాదం తప్పిందని తెలిపారు. బాధ్యతగల నర్సింగరావు చేసిన కృషిని కమిషనర్ సందీప్ శాండిల్య, డీసీపీ కవిత, ఏసీపీ, సీఐ తదితరులు వారిని అభినందించారు.




లెజెండ్స్ లీగ్ క్రికెట్ జెర్సీని ఆవిష్కరిస్తున్న హీరో వెంకటేశ్, మాజీ క్రికెటర్లు

## లెజెండ్స్ లీగ్ క్రికెట్ జెర్సీ ఆవిష్కరణ

కొండాపూర్, నవంబర్ 18: లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ20 టోర్నమెంట్‌లో అర్బన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూ, టోర్నీ ఆసాంతం విజయవంతంగా దూసుకుపోతుందని సినీనటుడు, హీరో వెంకటేశ్ అన్నారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై లెజెండ్స్ లీగ్ క్రికెట్ జెర్సీని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, అర్బన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ సురేష్ రైనా, కోచ్ మాజీ క్రికెటర్ నిఖిల్ చోప్రాల నేతృత్వంలో ఉత్తమంగా రాణించనున్నట్లు తెలిపారు. క్రికెట్ ప్రియులకు వినోదాన్ని పంచేందుకు లెజెండ్స్ లీగ్ క్రికెట్ నవంబర్ 21 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిఖిల్ చోప్రా, ప్రజ్ఞాన్ ఓజా, మార్టిన్ గప్టిల్, తిరుమలశెట్టి సుమన్, మనోజ్ నంబూరు, తదితరులు పాల్గొన్నారు.

## వీడ్కోలు చెప్పేందుకెళ్లి.. అనంతలోకాలకు..

- డ్రైవర్ నిర్లక్ష్యం... బస్సు కింది పడి చిన్నారి దుర్మరణం
- జవహర్‌నగర్‌లో దారుణం... తల్లడిల్లిన కుటుంబ సభ్యులు




భవ్యశ్రీ(ఫైల్)

జవహర్‌నగర్, నవంబర్ 18: పాఠశాలకు వెలుతున్న అన్నకు బాయ్ చెప్పేందుకు తల్లి వెంట వెళ్ళిన ఓ చిన్నారి అదే పాఠశాల బస్సు కింది పడి దుర్మరణం పాలైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన ప్రకారం, కార్పొరేషన్‌లోని ఎక్స్‌సర్వీస్ కాలనీలో పెద్దినేని గణేశ్, భార్య పావని, కుమారుడు రిషిక్, కుమార్తె భవ్యశ్రీతో కలిసి నివాసముంటున్నారు. గణేశ్ ఆర్మీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రిషిక్ జవహర్‌నగర్‌లోని రచన గ్రామర్ స్కూల్‌లో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజు రిషిక్‌ను స్కూలు బస్సు ఎక్కించేందుకు తల్లి వెంట భవ్యశ్రీ(2.5) కూడా వచ్చేది. శనివారం ఉదయం అన్నయ్య రిషిక్‌ని స్కూలు బస్సు ఎక్కించేందుకు తల్లితో వచ్చిన భవ్యశ్రీ ప్రమాదవశాత్తు అదే స్కూలు బస్సు చక్రాల కింది పడటం, దీంతో తలపై వెళ్ళడంతో ప్రాణాలు కోల్పోయింది. స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకుళ్లగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. తండ్రి గణేశ్ ఉద్యోగ రీత్యా రాజస్థాన్‌లో ఉన్నాడు. తల్లి ముందే బిడ్డ ప్రాణాలు పోవడంతో ఆమె దుఃఖాన్ని ఆపడం ఎవరి తరం కాలేదు. అల్లారి ముద్దుగా ఉండే భవ్యశ్రీ లేదని తెలవడంతో ఆనందర్‌నగర్ కాలనీ వాసులు శోక సముద్రంలో మునిగిపోయయింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతోనే చిన్నారి ప్రాణాలు పోయాయని కాలనీవాసులు ఆరోపించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉల్లంఘనులపై సీ-విజిల్

- 571 ఫిర్యాదుల స్వీకరణ.. వంద నిమిషాల్లో పరిష్కారం
- యాప్ వినియోగంపై విస్తృత స్థాయిలో అవగాహన




సిటీబ్యూరో, నవంబరు 18(నమస్తే తెలంగాణ): సాధారణంగా ఎన్నికలు అనగానే ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు రాజకీయ పార్టీలు ఉపక్రమిస్తుంటాయి. కానీ, ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో ఉల్లంఘనలు తప్పించుకోవడానికి వీల్లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలుకు భారత ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఉల్లంఘునలపై ఉక్కుపాదం మోపుతున్నది. ఇప్పటి వరకు 571 ఫిర్యాదులు రాగా, వాటన్నింటినీ వంద నిమిషాల్లో పరిష్కరించడం జరిగిందని ఎన్నికల అధికారులు శనివారం తెలిపారు. సీ-విజిల్ యాప్ వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని, బస్ షెల్టర్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద, మెట్రో ఫిల్లర్స్, మెట్రో మధ్యలో ఉండే బోర్డుపై అవగాహన కల్పిస్తున్నారు.

### ఉల్లంఘన అంశాలు..

- ఓట్ల కోసం అభ్యర్థులు వారి అనుచరులు భౌతికంగా, మానసికంగా భయాందోళనకు గురి చేయడం
- బహిరంగ ప్రదేశాల్లో విద్వేషపూరిత ప్రసంగాలతో ఓటర్లను రెచ్చగొట్టడం
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం పంపిణీ
- ప్రచార గడువు ముగిసిన తర్వాత సైతం స్వీకర్లు, ప్రలోభాల్లో భాగంగా వస్తువులు, సామగ్రి పంపిణీ
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో బాధ్యతా రాహిత్యం
- ఎన్నికల ప్రచార నిబంధనలు ఉల్లంఘున

ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ఏదైనా ఒక అంశంపై జరిగినా ఫిర్యాదు చేయొచ్చు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారితనం పెరిగేందుకు దోహదపడిన వారు అవుతారని అధికారులు పేర్కొన్నారు.

### ఫిర్యాదు చేయండిలా

- సీ-విజిల్ యాప్‌ను ఈ ఎన్నికల్లో బ్రహ్మాస్త్రంగా వినియోగించుకోవచ్చు. ఈ యాప్ వినియోగంలో భాగంగా తొలుత గూగుల్ లేదా ప్లేస్టోర్‌లో సీ-విజిల్ యాప్ అని టైపు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉన్న చోట నుంచే ఫోన్ ద్వారా ప్రక్రియ చేపట్టవచ్చు. ఉల్లంఘునలకు సంబంధించిన చిత్రాలను తీసి ఫిర్యాదు చేస్తే చాలు. ఈ సమయంలో ఫిర్యాదు చేసే వ్యక్తి తమ వివరాలను నమోదు చేయాల్సిన అవసరం లేదు. వారి వివరాలు గ్రూప్‌లో ఉంటాయి. ఫిర్యాదుకు సంబంధించిన ఫొటో కానీ రెండు నిమిషాల నిడివితో ఉన్న వీడియోలు కానీ, యాప్‌లో డౌన్‌లోడ్ చేయాలి. వంద నిమిషాల్లో సమస్యను పరిష్కారిస్తారు. పరిష్కరించిన తర్వాత సంబంధిత ఫిర్యాదుదారుడి ఐడీకి పంపిస్తారు.

### సమస్యకు పరిష్కారం

రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో పాటు సాధారణ ప్రజలు చేసిన ఫిర్యాదు ఐదు నిమిషాల్లో జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలోని మానిటరింగ్ సెల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి ఐదు నిమిషాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలోని ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు చేరుతుంది. వారు 15 నిమిషాల్లో క్షేత్రస్థాయి విచారణ చేస్తారు. ఆ నివేదికను 30 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి వెళ్లేలా చూస్తారు. దానిని రిటర్నింగ్ అధికారి 45 నిమిషాల్లో పరిశీలిస్తారు. అక్కడ నిర్ధారణ కాకపోతే ఫిర్యాదు జిల్లా ఎన్నికల అధికారి పరిష్కరిస్తారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుకు వంద నిమిషాల్లోనే పరిష్కారం చూపుతారు.

# మొక్కల ఎదుగుదల మన బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ డా. ఉదయ్‌సింగ్ గౌతమ్

- నిరంతర కృషితో పాటు అవగాహన రైతులకు చేరాలి
- మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.ఉదయ్‌సింగ్ గౌతమ్

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 18: ప్రతి మొక్క ఆరోగ్యంగా పెరిగి మంచి ఫలితాలివ్వాలంటే మనమంతా నిరంతరం కృషి చేయాలని, భారత వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.ఉదయ్‌సింగ్ గౌతమ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో శనివారం జరిగిన అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 'మొక్కల ఆరోగ్య నిర్వహణ ఆవిష్కరణలు -సుస్థిరత' అనే అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి పరిశోధనలు శ్రీకారం చుట్టాలన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలికి దిశానిర్దేశ, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి ప్రధానం అన్నారు. శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమాలు, సామర్థ్యం పెంపు కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఉత్తమ పరిశోధనా పత్రాలను శాస్త్రవేత్తకు పురస్కారాలను అందజేశారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియోషన్ ఫెలోఫషిప్‌లను 37 మంది శాస్త్రవేత్తలకు అందజేశారు. సమావేశలో పీపీఏఐ అధ్యక్షులు డా.శరత్ బాబు, ఐఐఓఆర్ మాజీ డైరెక్టర్ డా. కేవీస్ వరప్రసాద్, డా.షేక్ మీరా, డా.జల్లా సత్యనారాయణ, డా.జగదీశ్వర్, టీవీకే సింగ్, డా.నరేందర్‌రెడ్డి, పరమేశ్వరి, డా. రెహమాన్ పాల్గొని పలు సూచనలు చేశారు.

## ఓటర్లకు డబ్బు లు పంచుతుండగా.. బీజేపీ అభ్యర్థి అనుచరుడి పట్టివేత

జీడిమెట్ల, నవంబర్ 18: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి చింతల్‌లో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ అనుచరుడిని శనివారం బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసి లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. జీడిమెట్ల సీఐ ఎం.పవన్ తెలిపిన ప్రకారం, కుత్బుల్లాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్‌కు చెందిన సమ్మక్క సారలక్క క్రషర్ మిషన్‌లో పని చేస్తున్న అఖిల్ చింతల్‌లో ఓటర్లకు డబ్బులు పంచేందుకు లక్ష రూపాయల నగదు తీసుకుని వెళ్తున్నాడు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా, చింతల్‌లో అఖిల్ డబ్బులు పంచుతుండగా బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఒక్కో ఓటర్‌కు రూ.5 వేల చొప్పున పంచేటి కవర్లలో లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అఖిల్ వద్ద లక్ష రూపాయాల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

## తాను మరణిస్తూ....



సూరజ్ పుండలిక్ రావు (ఫైల్)

ఖైరతాబాద్, నవంబర్ 18: తాను మరణించినా ఆరుగురికి జీవనదానం చేశాడు సూరజ్ పుండలిక్ రావు సన్ కాంబ్లే (29). మహారాష్ట్ర నాందెడ్‌కు చెందిన సూరజ్ ప్రైవేట్ ఉద్యోగి. ఆయనకు తల్లిదండ్రులు పుండలిక్ గోవింద రావు, నాగుల్ బాయి ఉన్నారు. గత నెల 14న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. దీంతో చికిత్స కోసం స్థానిక దవాఖానలో చేర్పించగా, ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 17న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టను వివరించగా, అందుకు అంగీకరించారు. సూరజ్ శరీరం నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, కండ్లను సేకరించారు. అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ ప్రతినిధులు అభినందించారు.

## నాందెడ్ - పన్వేల్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో నాందెడ్-పన్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య రెండు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే అధికారులు శనివారం పేర్కొన్నారు. ఈ నెల 20, 21 తేదీలలో రెండు ప్రత్యేక రైళ్లను నడిపిస్తామన్నారు. అయితే, ఈ మార్గంలో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉండటం వల్ల ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.